





ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 5 నుంచి 25 వరకు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 20 సెంటర్లు.. 9317 మంది విద్యార్థులు
- జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో ఎగ్జామ్స్
- ఐదు నిమిషాల నిబంధన అమలులోకి..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు గాను అధ్యాపకులు 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ప్రత్యేక తరగతుల నిర్వహణతో విద్యార్థులను సమాయత్తం చేశారు. పరీక్ష విధి విధానాలను పకడ్బందీగా నిర్వహించేందుకు గాను ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 5న ప్రారంభమై 25న ముగుస్తాయి. జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3195 మంది, వొకేషనల్ విద్యార్థులు 1199 వెరసి 4395 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3716, వొకేషనల్ విద్యార్థులు 1206 వెరసీ 4922 విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ, ద్వితీయ జనరల్, వొకేషనల్ విద్యార్థులు మొత్తం 9317 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఉదయం 9 గంటలకే పరీక్షలు ప్రారంభమవుతాయని 5 నిమిషాల తర్వాత ఆలస్యమైన విద్యార్థులను అనుమతించబోరని ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాలను అమలు చేయనున్నారు. నిమిషం కంటే ఐదు నిమిషాల నిబంధన అమల్లోకి వచ్చింది. విద్యార్థులు నిర్ణీతసమయాని కంటే ముందే పరీక్షలు రాసినపట్టికి 12 గంటల తర్వాతనే విద్యార్థులను పరీక్ష కేంద్రాల నుంచి పంపించనున్నట్లు తెలుస్తోంది. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇద్దరు కస్టోడియన్ అధికారులు, 1 ఫ్లయింగ్ స్క్వాడ్, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 240 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష పేపర్ల విడుదల

విద్యార్థులు రాసే పరీక్ష పత్రాలను ఆయా పరీక్ష కేంద్రాల్లో అమర్చిన సీసీ కెమెరాల నిఘాలోనే చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో పరీక్ష పత్రాలను ఓపెన్ చేసి విద్యార్థులకు అందజేస్తారు. దీని ద్వారా ఏ సమయంలో పేపర్లు ఓపెన్ చేశారో.. ఎవరెవరు ఉన్నారనే విషయం కెమెరాలో నిక్షిప్తం కానుంది.

జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో పరీక్షలు..

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో జరుగనున్నాయి. ఇందులో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా ఎస్పీ సుధీర్‌రా ంనాథ్‌కేకన్ పర్యవేక్షణలో డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐ, జూనియర్ లెక్చరర్‌లతో కూడిన ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, నలుగురు సభ్యులతో కూడిన సిట్టింగ్ స్క్వాడ్, డీఐఈవో జిల్లా పరీక్షల సంఘం స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నారు.

పరీక్ష కేంద్రాలివే..

జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (జీజేసీ), జీజేసీ గార్ల, మహబూబాబాద్‌లోని జీజేసీ (బా లుర), జీజేసీ (బాలికలు), సాంఘీక సంక్షేమ గురుకుల (బాలికలు) కళాశాల, మోడల్ స్కూల్ కళాశాల, శ్రీ వివేకానంద కళాశాల, నలంద, వికాస్ జూనియర్ కళాశాలలు, జీజేసీ, మోడల్ స్కూల్ కళాశాల మరిపెడ, జీజేసీ, సమత జూ నియర్ కళాశాల, సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల తొర్రూరు, జీజేసీ నెల్లి కుదురు, జీజేసీ కేసముద్రం, జీజేసీ గూడూరు, జీజేసీ కొత్తగూడ, డీడీ కళాశా ల డోర్నకల్, టీఎస్‌టీడబ్ల్యూఆర్‌ఎస్- కురవి సెంటర్లను ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి
సీహెచ్ మదార్‌గౌడ్, డీఐఈవో, మహబూబాబాద్



జిల్లాలో ఈ నెల 5 నుంచి నిర్వహించబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందిగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాం విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు బయటి వ్యక్తుల మాటలు, ప్రలోభాలకులోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి.

ఇంటర్మీడియట్ పరీక్ష షెడ్యూల్ ఇదే...

మొదటి సంవత్సరం

తేది	పేపర్- 1
05-03-2025 (బుధవారం)	తెలుగు/సంస్కృతం, హిందీ
07-03-2025 (శుక్రవారం)	ఇంగ్లీషు
11-03-2025 (మంగళవారం)	గణితం-ఏ, వృక్షశాస్త్రం, సివిక్స్
13-03-2025 (గురువారం)	గణితం-బి, జంతుశాస్త్రం, చరిత్ర
17-03-2025(సోమవారం)	భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం
19-03-2025 (బుధవారం)	రసాయశాస్త్రం, వాణిజ్యశాస్త్రం
21-03-2025 (శుక్రవారం)	పబ్లిక్‌అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జికోర్స్ గణితం (బైపీసీ విద్యార్థులకు)
24-03-2025 (సోమవారం)	మోడ్రన్‌లాంగ్వేజ్, జియోగ్రఫీ

ద్వితీయ సంవత్సరం

తేది	పేపర్- 2
06-03-2025 (గురువారం)	తెలుగు/సంస్కృతం, హిందీ
10-03-2025 (సోమవారం)	ఇంగ్లీషు
12-03-2025 (బుధవారం)	గణితం-ఏ,వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం
15-03-2025 (శనివారం)	గణితం-బి, జంతుశాస్త్రం, చరిత్ర
18-03-2025 (గురువారం)	భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం
20-03-2025 (గురువారం)	రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం
22-03-2025 (శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జికోర్స్ గణితం (బైపీసీ విద్యార్థులకు)
25-03-2025 (మంగళవారం)	మోడ్రన్‌లాంగ్వేజ్, జియోగ్రఫీ

శ్రీపాల్‌రెడ్డిదే విజయం

వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నిక

- హోరాహోరీ పోరులో గెలిచిన పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి
- అతి పెద్ద సంఘం కావడం కలిసొచ్చింది..



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది, విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయు) అభ్యర్థిగా బరిలో దిగిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. నల్లగొండ జిల్లా కేంద్రం ఆర్జాల బావిలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో స్టేట్ వేర్ హౌజ్ గోదాంలో సోమవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 20రౌండ్లలో కొనసాగింది. ప్రతీ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డిదే ఆధిపత్యం కొనసాగింది. అయితే ఎలిమినేషన్ ప్రక్రియలో భాగంగా చివరకు శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం సాధించారు. పూర్తి స్థాయిలో గెలుపు కోటా ఓట్లు రాకపోయినా ఆధిక్యత ప్రామాణికంగా శ్రీపాల్‌రెడ్డిని విజేతగా ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ నుంచి బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 19మంది పోటీ చేసినా ఆది నుంచి అయిదుగురు మధ్యే పోటీ ఉంటుందనేది ఉపాధ్యాయ వర్గాల చర్చ. ఓట్ల లెక్కింపులో కూడా అదే రుజువైంది. అయితే ఒక్కొక్కరుగా ఎలిమినేట్ కాగా శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని అందుకున్నారు.

ఆది నుంచి ఆధిక్యమే...

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి శ్రీపాల్‌రెడ్డి ఆధిపత్యం కొనసాగుతూ వచ్చింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో శ్రీపాల్ రెడ్డికే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. మొదటి రౌండ్ మొదలు చివరి రౌండ్ వరకు శ్రీపాల్‌రెడ్డిదే ఆధిపత్యం కొనసాగింది. అయితే రౌండ్ల లెక్కింపు కొనసాగుతున్న క్రమంలో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. మొదటి ప్రాధాన్యత, రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయినప్పటికీ పూర్తి స్థాయిలో గెలుపు కోటా ఓట్లు రాకపోయినా

మిగతా 6వ పేజీలో...



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

రైల్వే మూడో లైన్ పనులను త్వరగా పూర్తి చేయండి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న రైల్వే మూడో లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక శాసనసభ్యులు భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కొనసాగుతున్న మూడవ రైల్వే లైన్ పనులను సోమవారం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో పనులను వేగవంతంగా చేస్తూ గడువులోగా రైల్వే మూడో లైన్ పనులను పూర్తి చేయాలని సూచించారు. మహబూబాబాద్ నుంచి నిత్యం అనేకమంది రైల్వే ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తారని రైల్వే స్టేషన్‌లో వారికి మౌళిక వసతులు కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ మదన్‌గోపాల్ లోయా, కాంగ్రెస్ నాయకులు చలమల నారాయణ, రామగోని రాజుగౌడ్, శంతన్ రామరాజు, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, సిరిపురం వీరన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ నీరందేలా చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సీఎస్‌తో వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం యాసంగికి సాగునీటి సరఫరా, నీటిపారుదల శాఖ పనితీరుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ శాంతికుమారి మాట్లాడుతూ యాసంగి పంట సంరక్షణకు రాబోయే పదిరోజులు కీలకమన్నారు. వ్యవ సాయశాఖకు నిరంత రాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లలో అవసరమైన మేర సాగునీరు అందుబా టులో ఉందని, పంటలకు సమృద్ధిగా నీటిని విడుదల చేయడం జరుగుతుందని, అవి చివరి ఆయకట్టు వరకు చేరేలా పర్యవేక్షించాలన్నారు. సాగునీటి ఇబ్బందులు తలెత్తే జిల్లాల్లో తహసీల్దార్‌లు, నీటిపారుదల శాఖ, వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా పర్యటించేలా చూడాలన్నారు.

రాష్ట్రం లో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తనిఖీల తర్వాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశా లల్లో రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు సరైన విద్య అందేలా చూడాలన్నారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

ఆదాయం ఫుల్.. అభివృద్ధి నిల్

120 వసంతాలు పూర్తి చేసుకున్నా సమకూరని సౌకర్యాలు

గార్ల రైల్వేస్టేషన్‌పై చిన్న చూపు



గార్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్న చందాన మానుకోట జిల్లా గార్ల మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటోంది. 120 వసంతాలు పూర్తి చేసుకొని ఆదాయం సమకుర్చడంలో పరుగులు పెడుతోంది.. రైల్వే అధికారుల చిన్న చూపుతో అభివృద్ధి మాత్రం అసలే జరగడం లేదు. మండల కేంద్రంతో పాటు పలు ఏజెన్సీ గ్రామాలకు కేంద్ర బిందువుగా వున్న ఈ రైల్వే స్టేషన్ ద్వారా సుమారు రోజుకు 3వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నారు. రోజువారీగా సుమారు 70 నుంచి 80 వేల వరకు ఆదాయం సమకూరోతుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ రైల్వే స్టేషన్ నేటికి కనీస మరమ్మత్తులలకు నోచుకోలేక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు అధ్వానంగా అక్కరకు రాకుండా ఉన్నాయి. రాత్రి సమయంలో హైదరాబాద్ నడుస్తున్న మణుగురు సూపర్ ఫాస్ట్‌ను ఈ స్టేషన్‌లో ఆరు నెలల నుంచి నిలుపుదల చేసిన అధికారులు ఆదాయం రావడం లేదనే సాకుతో ఈ నెల 18 నుంచి ఆపేది లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ గార్ల రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి పర్చి నూతనంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసే విధంగా రైల్వేశాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిందేనని పలువురు ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



గోవింద్(ఫైల్)

కురవి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురవి మండలం పెద్దతండాకు చెందిన గుగులోత్ గోవిండ్ (28) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్ గత మూడు సంవత్సరాలుగా బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలనే హైదరాబాద్‌కు బదిలీపై వచ్చాడు. ఆదివారం అర్థరాత్రి ఆఫీస్ ముగించుకుని రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఐకియా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం గోవింద్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. గోవింద్ తలకు హెల్మెట్ ఉన్నప్పటికి శరీరం లోపల రక్తనాళాలు తెగిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడి తండ్రి విజయ్ గతంలో పెద్దతండా ఉపసర్పంచ్‌గా పనిచేశాడు. ముగ్గు రు ఆడపిల్లల తర్వాత జన్మించిన గోవింద్ మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రం లో మునిగిపోయింది. సోమవారం సాయంత్రం మృతదేహాన్ని పెద్దతండాకు తీసుకురా గా, గోవింద్ మృతదేహాన్ని చూసిన తండవా సులు విషాదంలో మునిగిపోయారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

బాలుర కళాశాల వసతి గృహం..
వార్డెన్ తీరుపై విచారణ

వివరాలు సేకరించిన వరంగల్ డీటీడీవో సౌజన్య



రికార్డులను పరిశీలిస్తున్న డీటీడీవో సౌజన్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెహ్రూసెంటర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో వరంగల్ డీటీడీవో సౌజన్య విచారణ చేపట్టారు. స్థానిక కళాశాలలో సోమవారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదేశాల మేరకు వరంగల్ డీటీడీవో సౌజన్యను విచారణాధికారిగా వివరాలను సేకరించారు. జనవరి 23న ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో ప్రచురితమైన ఈ హాస్టల్ లో ఉండేదెట్లా.. అనే కథనానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. దీంతో సదరు వరంగల్ డీటీడీవో సౌజన్యను విచారణకు ఆదేశించారు. వసతిగృహంలో వార్డెన్ వ్యవహరిస్తున్న తీరు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పూర్తిస్థాయిలో విచారణ చేసి అన్ని కోణాల్లో విద్యార్థులను, వార్కర్లను, హాస్టల్ వార్డెన్లను, వసతిగృహానికి సమీపంలో ఉన్న ప్రజలను వేర్వేరుగా విచారించి వివరాలను సేకరించారు. సేకరించిన వివిధ అంశాలను ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాలను అందించనున్నట్లు వరంగల్ డీటీడీవో సౌజన్య తెలిపారు. ఈ కళాశాల వసతిగృహంతో పాటు మరో రెండు వసతి గృహాలను సందర్శించినట్లు తెలిపారు.

కల్యాణ వీరభద్రుడు కదిలొచ్చే..



కురవి క్షేత్రంలో రథంపై ఊరేగుతున్న వీరభద్రస్వామి, భద్రకాళిమాత

కురవి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణమహోత్సవాల్లో భాగంగా వీరభద్రుడి రథోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. శైవ ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించిన ఈ రథోత్సవ పూజాకార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాజ్ఞనం, నవగ్రహ పూజ, వాస్తుపూజ, వాస్తుహోమం, బలిహరణ, దిష్టికుంభం, దేవతా పూజాచారాలతో రథంలో విగ్రహ పూజలు జరిపారు. స్వామివారి రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగితే పాపాలు పోతాయని, కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ప్రతీతి.

పురాతన చెక్కరథంలో కల్యాణ వీరభద్రుడు, భద్రకాళి మాతలు కదిలివస్తుంటే మహిళలు, భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులు అధికంగా తరలివచ్చి రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. శివసత్తుల తాండవం, నేరడ కళాకారుల చిడుతల, కట్టె భజనల నడుమ గ్రామపురవీధుల గుండా రథోత్సవం సాగింది. గ్రామ నడిబొడ్డుకు రథం చేరిన తర్వాత మంగళవాయిద్యాలతో సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, విజయ్, అనిల్, పుణ్యమూర్తి, రమేష్‌లు ఈ పూజాకార్యక్రమాలను కొనసాగించారు. రాత్రి పదిగంటల వరకు గ్రామపురవీధుల్లో భద్రకాళి సమేత వీరభద్రుడు మేళతాళాల మధ్య రథంలో ఊరేగించారు. ఊరేగింపులో తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన శివ అలంకరణ భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం రథాన్ని భక్తులు ఆలయ పురవీధుల్లో రథాన్ని లాగారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ హాజరయ్యారు. మహబుబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, దేవాలయ ఛైర్మన్ కోర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, మాజీ ఛైర్మన్‌లు మేక దామోదర్‌రెడ్డి, సోమిశెట్టి శ్రీనివాస్, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, అవిరె మోహన్‌రావు, ఎర్ర నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, బెడద వీరన్న తదితరులు పాల్గొన్నారు. రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గండ్రాతి సతీష్ బందోబస్తు పర్యవేక్షించారు.

వైభవంగా భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం

- శివసత్తుల తాండవాలు, చిడుతల భజనలు
- భక్తులతో కిక్కిరిసిన పురవీధులు





గూడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సూర్యప్రకాష్

5.440 కిలోల ఎండుగంజాయి పట్టివేత

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గూడూరు నుంచి మహబూబాబాద్‌కు తరలిస్తున్న 5.440 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు సోమవారం తెలిపారు. ఈ నెల 2న గూడూరు నుంచి మహబూబాబాద్ గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో మచ్చర్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న గూడూరుకు చెందిన మేడ సుజిత్, గూడూరు మండలం పొనుగోడు శివారు టేకుల తండా కు చెందిన భూక్య మనేష్‌లను పోలీసులు ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 5.440 కిలోల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించి దానితో పాటు రవాణాకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుమారు దీని విలువ రూ.2.72 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి మహబూబాబాద్ ప్రాంతంలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్సైబిచ్యానాయక్, సిబ్బంది రాజేష్, ప్రణీత్, అమ్రు, సుధాకర్ పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.చౌడేశ్వరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ 2025-26 సంవత్సరానికి చేనేత టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా మూడు సంవత్సరాల కోర్సుకు 60సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. అర్హులు ఏప్రిల్ మొదటి వారంలోగా హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 90300 79242ను సంప్రదించగలరని తెలిపారు.

ఆస్కార్ సాధించిన బృందంలో అమినాపురం వాసి

'డూన్' చిత్రం వీఎఫ్ఎక్స్ టీంలో పనిచేసిన సుమంత్‌రెడ్డి



సుమంత్‌రెడ్డి

కేసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు పొందిన బృందంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురం వాసి ఎడ్ల సుమంత్‌రెడ్డి ఉండడం విశేషం. అమెరికా లాస్‌ఏంజెల్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో ఉత్తమ విజువల్ ఎఫెక్ట్ విభాగంలో 'డూన్ పార్ట్ 2' చిత్రం అస్కార్ అవార్డును దక్కించుకుంది. అయితే ఈ చిత్రానికి ముంబై కేంద్రంగా 'డినెగ్' అనే సంస్థ విజువల్ ఎఫెక్ట్స్‌ను అందించగా ఆ విజువల్ ఎఫెక్ట్ బృందంలో అమినాపురానికి చెందిన సుమంత్‌రెడ్డి కూడా పనిచేశారు. సుమంత్‌రెడ్డి హైదరాబాద్ జేఎన్‌టీయూలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసి 2021లో ఈ చిత్రం కోసం సంస్థలో మోడలింగ్ టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. వర్క్‌ఫ్రం హోం విధానంలో అమినాపురంలోని ఇంటి నుంచే పనిచేసిన తాను ఈ సినిమాలో బటిస్టా, హర్కొనెన్ సహా ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేసినట్లు సుమంత్‌రెడ్డి తెలిపారు. ప్రసిద్ధ హాలివుడ్ సినిమాలు 'ఫాస్ట్ ఎక్స్ ఫెరిసా, బోర్డర్‌ల్యాండ్' చిత్రాలకు కూడా పనిచేశానని, ప్రపంచస్థాయి అవార్డులో భాగస్వామ్యమైన సుమంత్‌రెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఎయిర్‌పోర్ట్‌తో వరంగల్ దశ మారనుంది

- సీఎం జీఎంఆర్ సంస్థను ఒప్పించి ఎన్‌వోసీ తెచ్చారు
- వరంగల్ అభివృద్ధికి రూ. 6వేల కోట్లు మంజూరు చేసిన రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ నాయకులు పదేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను విస్మరించారు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

హనుమకొండటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వరంగల్ దశ మారనుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ రెక్కలు రానున్నాయని ఇప్పటికే 696 ఎకరాల భూమి ఉందని, అదనంగా 253 ఎకరాల భూసేకరణ కోసం రైతులతో ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నట్లు తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మామునూరు ఎయిర్‌పోర్ట్ తీసుకురాలేదన్నారు. ఒక్క ఎకరం భూమి సేకరించలేదని, బీఆర్ఎస్ నాయకులు రైతులకు ఎకరానికి నాలుగు కోట్లు ఇవ్వాలంటున్నారని, రైతులకు ఎంత ఇవ్వాలో మీ వద్ద నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో ఉన్న సెంట్రల్ జైలును కూలగొట్టి కమీషన్ల కోసమే 24 అంతస్తుల భవనంలో ఆసుపత్రి పనులు 20శాతం పూర్తి చేసినట్లు విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అక్రమాలకు ఒక సపరేట్ జైలును పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే 190 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కృషి వల్లే మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎన్‌వోసీకూడా తీసుకురాలేదని విమర్శించారు. భూసేకరణకు ప్రభుత్వం రూ.205 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే వరంగల్ అభివృద్ధి కోసం రూ. 6వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తూ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో వరంగల్ కు వచ్చిన కేసీఆర్ వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తానన్నారు. అది ఏమైందని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై ఫోకస్ పెట్టడంవల్లే అనుమతులు వచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి మామునూర్‌లో భూసేకరణ ప్రారంభించినట్లు నేటి నుంచి సర్వే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ భూసేకరణ కు సహకరిస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నా లెక్క చేయకుండా బీజేపీ నాయకులు తామే సాధించామని ఎయిర్‌పోర్ట్ ప్రదేశంలో నానా హంగామచేశారని. వారిపై పోలీస్‌లు కేసు లు నమోదు చేయాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ మేయ ర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డిదే విజయం



కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థులు

(5వ పేజీ తరువాయి)

అధికృత ప్రామాణికంగా శ్రీపాల్‌రెడ్డిని విజేతగా ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ నుంచి బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు.

అతి పెద్ద సంఘమే కలిసి వచింది...

రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాల్లో పీఆర్టీయూ అతి పెద్ద సంఘంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 70వేలకు పైగానే ఉపాధ్యాయులు పీఆర్టీయూలో సభ్యత్వాలు కలిగి ఉన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కూడా ఈ సంఘం బలంగానే ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఆర్టీయూదే హవా కొనసాగుతోంది. దీంతో శ్రీపాల్‌రెడ్డి గెలుపు ఖాయమనే ధోరణిలోనే ఆ సంఘం నాయకులతో పాటు ఉపాధ్యాయ వర్గాలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్న సంఘంగా పీఆర్టీయూ ఉండటం, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెల్సీగా పోటీలో దిగడం అన్ని శ్రీపాల్‌రెడ్డికి కలిసి వస్తూనే ఉన్నాయి.

ఆది నుంచి పీఆర్టీయూ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్సీలకు విజయాలే... గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ అపజయం తప్ప పీఆర్టీయూ అభ్యర్థులు ఎప్పుడూ విజేతలుగానే నిలిచిన చరిత్ర ఉంది. ధర్మారెడ్డి, బి. మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, కాటేపల్లి జనార్థన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి పీఆర్టీయూ నుంచి విజయాలు సాధించగా ఇప్పుడు శ్రీపాల్‌రెడ్డి అదే సంఘం నుంచి ఎమ్మెల్సీ బరిలో నిలిచి జయకేతనం ఎగురవేశారు.

శ్రీపాల్ గురించి...

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన పింగిళి శ్రీపాల్‌రెడ్డిది పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లా. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన పోస్ట్‌మ్యాన్ పింగిళి రాంరెడ్డి-సరస్వతి దంపతులకు 1973 జనవరి 20న జన్మించారు. ఒకటి నుంచి ఆరో తరగతి వరకు గూడూరులోని ప్రభుత్వ పాఠశాలలో, ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు వరంగల్‌లోని మహబూబియా పంజేతన్ స్కూల్లో చదివారు. ఇంటర్, డిగ్రీ వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో పూర్తి చేసిన అనంతరం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. బీఈడీని ఇగ్నోలో, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌ని దూర విద్యా విధానంలో పూర్తి చేశారు. 1996లో ఎస్జీటీగా ఎంపికై డిసెంబరు 12న నెక్కొండ మండలం గొల్లపెల్లి యూపీఎస్‌లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా చేరారు. 2003 జూలైలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట యూపీఎస్‌కు ప్రమోషన్‌పై వచ్చారు. అక్కడ నుంచి బదిలీపై నెక్కొండ మండలం బొల్లికొండ యూపీఎస్‌కు వెళ్లారు. అక్కడ నుంచి గీసుగొండ మండలం శాయంపేట జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చారు. ఇక యూనియన్ విషయానికొస్తే 2000 సంవత్సరంలో పీఆర్టీయూ నెక్కొండ మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. తర్వాత 2002 నుంచి 2008 వరకు అదే మండలానికి అధ్యక్షుడిగా పనిచేశారు. 2008 నుంచి 2012 వరకు వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. 2015లో వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2016 నుంచి 2017 వరకు వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ఫిబ్రవరి 2019 నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రౌండ్ల వారీగా లెక్కింపు ఇలా...

శ్రీపాల్‌రెడ్డి తొలి రౌండ్‌లో 6035 ఓట్లతో ముందంజలో ఉన్నారు. ఈ రౌండ్‌లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి 4820 ఓట్లు వచ్చాయి. రెండు, మూడు, నాలుగో రౌండ్‌లోనూ అదే పరంపర కొనసాగింది. రెండో రౌండ్‌లో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రెండో రౌండ్‌లో ఒక్కరు, మూడో రౌండ్‌లో ఇద్దరు అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. శ్రీపాల్‌రెడ్డికి అయిదో రౌండ్‌లో 6035, ఆరవ రౌండ్‌లో 6042, 7వ రౌండ్‌లో 6045, 8వ రౌండ్‌లో 6047, 9వ రౌండ్‌లో 6048, 10, 11 రౌండ్లలో 6054, 12వ రౌండ్‌లో 6090, 13వ రౌండ్‌లో 6105, 14లో 6165, 15లో 6916, 16లో 7673, 17లో 9021, 18లో 11099, 19లో 13,969 ఓట్లు వచ్చాయి. 19వ రౌండ్ ఓట్ల లెక్కింపు ముగిసే సరికి పోటీలో ఉన్న 18 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. దీంతో శ్రీపాల్‌రెడ్డిని అధికారికంగా విజేతగా ప్రకటించారు.

నేడు అకూట్ ఎన్నికలు

- ఉదయం 10 నుంచి 2 గంటల వరకు
- రెండు ప్యానళ్ళ మధ్య హోరాహోరీ పోటీ
- విస్తృతంగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న అకూట్ అధ్యక్షకార్యదర్శి అభ్యర్థులు ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, ఎల్‌పీ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకూట్)ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి. గతంలో కంటే ఈ దఫా అకూట్ ఎన్నికల పోటీ వర్సిటీలో రసావత్తరంగా మారింది. నువ్వా నేనా అన్నట్లు అకూట్ ఎన్నికల పోటీ హోరాహోరీగా సాగుతోంది. అకూట్ అధ్యక్షకార్యదర్శుల పదవులకు ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, మ్యాథ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ల ప్యానల్‌తో పాటు జియాలజీ ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పోడేటి శ్రీనివాస్ ప్యానళ్ళు పోటీ పడుతున్నాయి. వర్సిటీలో పేరొందిన ప్రొఫెసర్లు రెండు ప్యానళ్ళ అధ్యక్షకార్యదర్శుల పదవులకు పోటీకి దిగారు. దీంతో వర్సిటీలో అకూట్ ఎన్నికల్లో ద్విముఖ పోటీ నెలకుంది. మిగతా పదవులన్ని ఏకగ్రీవం అయ్యాయి. కాగా, అధ్యక్ష, కార్యదర్శుల అభ్యర్థులు గత నాలుగు రోజులనుంచి వర్సిటీ క్యాంపస్, సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీ కళాశాలతో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. కాగా గతంలో రెండు దఫాలుగా ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అకూట్ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉండగా తొలి సారిగా ఈ సారి తమ ప్యానల్‌కు అవకాశం ఇవ్వాలని ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు అధ్యాపకులను కోరుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. సోమవారం ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌లు కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర విభాగాల్లో , ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ప్యానల్ కేయూ దూరవిద్య కేంద్రంలో అధ్యాపకులతో పాటు ఇతర విభాగాల్లో అధ్యాపకులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

10 నుంచి 2 గంటల వరకు పోలింగ్...

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, టీచింగ్ ఏఆర్ సీహెచ్.ప్రణయ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌తో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 77 మంది అధ్యాపకులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఒకే బ్యాలెట్ పేపర్....

అధ్యక్ష కార్యదర్శుల పోస్టులకు ఒకే బ్యాలెట్ పేపర్ల ఇస్తారు. రెండు ప్యానళ్ళ నుంచి నలుగురి పేర్లు ముద్రించి ఉంటాయి. వారిలో అధ్యక్ష పదవికి ఒక్కరూ కార్యదర్శి పదవికి ఒక్కరికి తమ ఓటును వేయాలి. పొరపాటుగా అధ్యక్షకార్యదర్శి పదవులకు ఒక్కోటి కంటే ఎక్కువగా ఏ కేటాగిరిలో ఓటు వేసినా అవి చెల్లవు. అధ్యక్ష పదవికి ఒక్కరికీ, కార్యదర్శి పదవికి ఒక్కరికే ఓటు వేయాలని సూచించారు. ఎన్నికలలో నలుగురు అధికారులతో పాటు ఇతర సపోర్టింగ్ సిబ్బందిని కేటాయించారు. కౌంటింగ్‌ను మార్చి 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య



లక్ష్మి(ఫైల్)

దుగ్గొండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, వ్యాపారంలో ఆర్థికంగా నష్ట పోయి అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళా రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మహ్మదాపురంలో సోమవారం చోటు చేసుకొంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గంధం లక్ష్మి(52), మొగిలి దంపతులు వ్యవసాయంతో పాటు గొర్రెలు, గేదెల వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామానికి చెందిన ఓ భూమి యజమాని దగ్గర ఆరు ఎకరాల పంట భూమి కౌలుకు తీసుకొని ఐదేళ్లుగా వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. గత ఏడాది లాగానే ఈ ఏడాది కూడా కౌలుకు తీసుకున్న పంట భూమిలో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంట భూమిలో పంటలు దిగుబడి రాలేదు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేని కారణంగా పంట కోసం పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థికంగా నష్ట పోయారు. వ్యవసాయంతో పాటు గంధం లక్ష్మి భర్త మొగిలి గొర్రెలు, గేదెల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో కూడా ఆర్థికంగా నష్ట వచ్చింది. వ్యవసాయం, వ్యాపారం పరంగా సుమారు రూ.10 లక్షలు నష్ట పోయిన దంపతులు మానసికంగా బాధపడేవారు. ఫిబ్రవరి 27న ఇంట్లో ఉన్న పురుగుల మందును గంధం లక్ష్మి తాగింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతిరాలు భర్త మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగల అరెస్టు

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీపీ



దొంగతనాల కేసులో పట్టుబడిన నిందితులతో ఏసిపి, సిబ్బంది

వర్ధన్నపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యం చేసుకొని చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబాటి నర్సయ్య తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన జాడి శ్రీకాంత్, కోడెం గణేష్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.5.86లక్షల విలువ గల బంగారం, వెండి, నగదులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు ఇద్దరు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన వారు. శ్రీకాంత్ చికెన్ సెంటర్‌లో పని చేయడంతో పాటు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతూ జాల్సాలకు అలువాటు పడ్డాడు. కోడెం గణేష్ డ్రైవర్‌గా పని చేస్తూ వచ్చిన ఆదాయంతో జాల్సాలు చేసేవాడు. వీరు ఇద్దరు కలిసి వర్ధన్నపేట ఫిరంగిగడ్డ, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ఇళ్లలో 82 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1లక్ష 5వేల నగదును చోరీ చేశారు. చోరికి పాల్పడ్డ వాటిని గణేష్ ఇంటిలో భద్రపరిచారు. దొంగిలించిన సొమ్మును తొర్రూరులో అమ్మేందుకు ఆభరణాలు తీసుకెళుతుండగా, వర్ధన్నపేట పోలీసులు మండలంలోని దమ్మన్నపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించారు. దీంతో వారు పాల్పడిన నేరాలను అంగీకరించినట్లు ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. శ్రీకాంత్ గతంలో ధర్మసాగర్‌లో చోరీకి పాల్పడడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు చందర్, రాజులతో పాటు పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

నర్సు అనుమానాస్పద మృతి



సంధ్య మృతదేహం

- ఉరేసుకుని ఆత్మహత్య.. హైదరాబాద్‌లో ఘటన
- ఒంటిపై గాయాలు ఉండడంతో అనుమానం
- స్వగ్రామం ఎల్లమ్మగడ్డతండాలో విషాదం

పాలకుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నర్సు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో అయ్యంగారిపల్లి శివారులోని ఎల్లమ్మగడ్డతండాలో విషాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం. తండాకు చెందిన వ్యవసాయ కూలి పనులు చేసుకుంటున్న నూనావత్ బుజ్జి, చలపతిల కూతురు సంధ్య(22) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తూ సికింద్రాబాద్‌లోని పార్శిగుట్ట ఏరియాలో అద్దె ఇంటిలో ఉంటోంది.

సోమవారం అద్దె ఇంట్లో ఉరి వేసుకుని కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహంపై గాయాలు కనిపించడంతో మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై పోలీసుల కు ఫిర్యాదు చేశారు.

కృషి



సిరులు కురిపిస్తున్న పొగాకు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

పంటపై సాగుకు ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

జనగామ జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం



పొగాకును కుచ్చుతున్న రైతు, ఆరబెట్టిన పొగాకు దొర్నాలు

రఘునాథపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో జనగామ జిల్లాలో పొగాకు సాగు ఏటికేడు పెరుగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, పాలకుర్తి, దేవరుప్పుల, నర్మెట, లింగాలఘణపురం, కొడకండ్ల మండలాల్లో రైతులు ఎక్కువగా పొగాకు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1250 మంది రైతులు ఆరువేల ఎకరాలలో సాగు చేశారు. క్వింటా పొగాకు రూ.15,500ధర పలుకుతోంది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖర్చు వస్తుంది. అంటే సుమారుగా ఎకరం పొగాకు పంట సాగు చేసిన రైతుకు అన్ని ఖర్చులు పోను రూ.1.20లక్షల ఆదాయం వస్తోందని పొగాకు రైతులంటున్నారు.

రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రం..

రైతుల నుంచి పొగాకు పంటను కొనేందుకు చేసేందుకు వీఎస్‌టీ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు పొగాకు ఉత్పత్తులకు నాణ్యత, రంగును బట్టి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర పలుకుతోంది. దళారులు లేకపోవడంతో మోసాలు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పోను ఎకరానికి సగటున రూ.1.10 లక్షల వరకు ఆదాయం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు సాగు చేసే గ్రామాలు..

రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, గబ్బెట, కోడూరు, రామన్న గూడెం, కన్నాయిపల్లి, గోవర్ధనగిరి, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లు, రాఘవ పురం, అక్కరాజుపల్లి, శివరెడ్డిపల్లి, మీదికొండ, ఇప్ప గూడెం, నర్మెట, లింగాలఘణపురం మండలంలోని నేలపోగుల, గుమ్మడవెల్లి, బండ్లగూడెం తదితర గ్రామాల్లోని రైతులు పొగాకును ఎక్కువ సాగు చేస్తారు.

పొగాకు సాగే మేలు: ఉత్తేపు కుమార్, బండ్లగూడెం



నేను రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇప్పటివరకు 10 క్వింటాళ్ల పొగాకును అమ్మగా రూ.1.40 లక్షలు వచ్చాయి. ఇంకా 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు పంట చేతికి రావాల్సిఉంది. ఇతర పంటలకు అవరమైన పెట్టుబడులు పొగాకుకు అవసరం ఉండదు.అందుకే ఇతర పంటలకన్న పొగాకు సాగే మేలు..

తక్కువ పెట్టుబడి.. : పుట్టల గట్టయ్య, ఇప్పగూడెం



పొగాకు పంటకు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం వస్తోంది. 15 ఏళ్ల నుంచి పొగాకు సాగు చేస్తున్నాను .పొగాకుకు ఎక్కువ సాగు నీరు, రసాయన ఎరువుల వాడకం ఉండక పోవడం వల్ల తక్కువ పెట్టుబడి మాత్రమే అవసరముంటుంది. నేను 3 ఎకరాలలో పొగాకు సాగు చేశాను. పెట్టుబడి రూ.90 వేలు పోను రూ.2.20 లక్షల ఆదాయం లభించడం అంటే కేవలం పొగాకు సాగుతోనే సాధ్యం.

ఆదర్శం

నిరక్షరాస్యుడైనా..

మిర్చి సాగులో విజయం సాధించాడు

అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడి

జాతీయ అవార్డుకు ఎంపికైన రైతు బోడ వీరన్న



మహబూబాబాద్ మండలం మల్యాల శివారులోని మేగ్యాతండాలోని తన మిర్చితోటలో తనకు వచ్చిన అవార్డుతో రైతు బోడ వీరన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆయనో సాధారణ రైతు. నిరక్షరాస్యుడు. ఉన్న 3.10 ఎకరాల్లో మిర్చి పంట వేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ ఏరకం విత్తనం వేస్తే బాగుంటుందనే దానిపై అందరిక కంటే మిన్నగా ఆలోచించాడు. చదువుకోకపోయినా సాగుపై ఉన్న ప్రేమతో ఉద్యాన శాస్త్రవేత్తలను ఆశ్రయించాడు. వారి సలహాలు పాటించాడు.. సాగులో విజయం సాధించాడు. రైతులంతా నల్లతామర, వైరస్ తెగుళ్లతో దిగుబడి రాక భారీగా నష్టపోతున్న సయయంలో ఆయన మాత్రం అధిక దిగుబడి సాధించి ఆదర్శంగా నిలిచాడు. అంతే కాదు జాతీయ ఉత్తమ రైతు అవార్డు కూడా అందుకున్నాడు. దేశవ్యాప్తంగా 14మంది ఉత్తమ ఉద్యాన రైతులుగా ఎంపికై తే.. వారిలో ఒకరిగా నిలాచాడు మ హబూబాబాద్ మండలం మల్యా ల గ్రామపరిధిలోని మేగ్యాతండాకు చెందిన బోడ భన్యా-శాంతిల కుమారుడైన వీరన్న. ఫిబ్రవ రి 27న బెంగళూరులోని జాతీయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-ఐఐహెచ్‌ఆర్) నేషనల్ హార్టికల్చరల్ ఫెయిర్‌లో కేంద్రమంత్రి సుశ్రీ శోభా కరండ్లజే నుంచి ఆయన అవార్డు అందుకున్నాడు.

సాధారణ రైతు విజయమిదీ..

తనకున్న 3.10ఎకరాల్లో మల్యాలలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తల సహకారంతో భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన ఆర్కా తేజస్వి మిర్చిరకానికి చెందిన 3 ప్యాకెట్ల విత్తనాలను వేశాడు. ఆయనకు ఆ విత్తనాలను ఎస్సీ, ఎస్టీ కోటా కింద ఉచితంగా అందించగా.. మిర్చినారు నాటిన నాటి నుంచి దుక్కిమందులైన యూరియా, పొటాష్ మందులను పంట దిగుబడి వచ్చే వరకు ఆరు సార్లు వేశాడు. 5 నుంచి 8 రోజుల కొకసారి పైమందులను పిచికారీ చేశాడు. శాస్త్రవేత్తల సాంకేతిక సూచనలు పాటిస్తూ పంట దిగుబడి వచ్చే వరకు వారు చెప్పిన విధంగానే మందులను వాడాడు. పంట చేతికి వచ్చిన సమయం వరకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశాడు. నల్లతామర కొద్దికొద్దిగా ఆశించినప్పటికీ శాస్త్రవేత్తల సూచనలు పాటించి క్రిమిసంహారిక మందులు వాడడంతో నల్లతామర, వైరస్ నశించిపోయాయి. చిన్నచిన్న చెట్లు ఉండగానే కాతకు వచ్చింది. పచ్చి మిర్చి కోతకు రావడంతో ముందుగా కోత కోయగా.. 2.86 క్వింటాళ్ల (ఆరు బస్తాల) దిగుబడి వచ్చింది. ఇక మొదటి క్రాప్ కింద ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు ఎండు మిర్చి దిగుబడి వచ్చింది. మొత్తం 2.50 ఎకరాల్లో 75 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చింది. అందులో 27 క్వింటాళ్ల ఎండుమిర్చి దశలవారీగా అమ్మేయడం, పచ్చిమిర్చి అమ్ముకోవడంతో రూ.3.93 లక్షల ఆదాయం సమకూరింది. ఇంకా కల్లంపై 48 క్వింటాళ్ల వరకు మిర్చిని ఎండబెట్టాడు. మార్కెట్‌లో మిర్చికి అధిక ధరలు పలికితే విక్రయిస్తానని 2వ క్రాప్‌లో ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు బోడ వీరన్న ఃఆంధ్రజ్యోతికి చెప్పారు. కాగా, మిర్చి ఏ వైరస్ లేకుండా పండితే 32 క్వింటాళ్ల వరకు సాధారణంగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాంటిది నాలుగు సంవత్సరాల నుంచి ఈ ప్రాంతాల్లో నల్లతామర, ఇతర వైరస్‌లు రావడం వల్ల మిర్చి పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. మహబూబాబాద్ జిల్లాలోని కొన్నిమండలాల్లోనైతే నల్లతామర, వైరస్ సోకడం ద్వారా ఆరు, ఏడు క్వింటాళ్ల వరకే దిగుబడి వచ్చింది. ఇలాంటిపరిస్థితుల్లో ఈ రైతు బోడ వీరన్న భారత ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన ఆర్కా తేజస్వీ వేయడం వల్ల ఎకరానికి మొదటి క్రాప్‌లోనే 30 క్వింటాళ్ల దిగుబడి రావడం ఓ సాధారణ రైతు సాధించిన విజయంగా అభివర్ణిస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది

మల్యాలలోని జేవీఆర్ పరిశోధన స్థానం నుంచి భారత ఉద్యాన పరిశోధనసంస్థ అభివృద్ధి చేసిన ఆర్కా తేజస్విని విత్తనాల మూడు ప్యాకెట్లను ఉచితంగా అందుకున్నా. జేవీఆర్ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి.. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడిని సాధించా. దాంతో భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అధికారులు జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 14 మంది రైతుల్లో నిరక్షరాస్యుడనైన నేను ఓ రైతుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నాకు సహకరించిన శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు.

- బోడ వీరన్న

సొంత ఖర్చులతో సైన్స్ ల్యాబ్



చక్రధర్ స్వయంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్ (ఫైల్)

- విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన టీచర్
- ఆదర్శంగా నిలిచిన చక్రధర్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాను పాఠాలు చెప్పే విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా ఉండేలా సొంతఖర్చులతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.చక్రధర్. విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం పాఠ్యాంశాలు సులభంగా అర్థం కావాలన్న లక్ష్యంతో ఆయన ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలలోని ఒక గదిలో సైన్స్ పరికరాలను అమర్చారు. సుమారు 300 ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు సంబంధించిన సైన్స్ కృత్యాలు, ప్రయోగాలు ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా, చిత్రాలు, పట్టికల రూపంలో విద్యార్థులకు చూపుతు పాఠ్యాంశాలు సులభంగా అర్థం కావడానికి కృషి చేస్తున్నారు. ప్రతీ నెలా తన వేతనం నుంచి కొంత భరిస్తు పాఠశాల హెచ్‌ఎం ఎం.సంపత్ సహకారంతో ల్యాబ్ ఏర్పాటు చేశారు.



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ఫిజిక్స్ ఎగ్జిబిట్లు, రసాయన పరికరాలు

ఇవీ ల్యాబ్‌లో ఉన్న పరికరాలు

ఈ ల్యాబ్‌లో పలు భౌతిక శాస్త్ర పాఠ్యాంశాలకు చెందిన కృత్యాలు, పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిలో కాంతి ప్రయోగాలు, లేజర్ కాంతి, ధ్వని, అయస్కాంతాలు, మన విశ్వం ఉన్నాయి. ఇక రసాయన శాస్త్రానికి సంబంధించి 118 మూలకాలతో నూతన పీరియాడిక్ టేబుల్, ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్ తయారు చేయడం, రసాయన చర్యలకు సంబంధించిన ప్రయోగాలు ఏర్పాటు చేశారు. లోహాలు, అలోహాలు, వాటి ధర్మాలు, ఆమ్లాలు, క్షారాలు, బేసిక్ ఎలక్ట్రానిక్స్ ప్రకృతి చక్రం, రవాణా, రోడ్డు భద్రతా నియమాలు, పీహెచ్ స్కేల్ తదితర అంశాలకు చెందిన కృత్యాలు ఉన్నాయి. ల్యాబ్ ఉపయోగించి విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా వారికి డ్రాయింగ్, లేబులింగ్, జత పరచడం, ప్రయోగాలు, పోస్టర్ డిజైనింగ్, ప్రాజెక్టు వర్క్, రీడింగ్, రైటింగ్ అభ్యాసం చేయిస్తున్నామని సైన్స్ టీచర్ చక్రధర్ చెబుతున్నారు.

రాయితీ ఇచ్చినా..



- ఎల్‌ఆర్‌ఎస్‌లో కానరాని స్పందన
- ఆసక్తిచూపని దరఖాస్తుదారులు
- సర్వేయర్ల కొరతతో ముందుకుసాగని పరిశీలన
- ఎన్‌వోసీలను అడుగుతున్న రిజిస్ట్రేషన్ అధికారులు
- అవి ఇచ్చేవారు లేక యజమానుల ఇబ్బందులు
- లైసెన్సుడు సర్వేయర్ల సాయం తీసుకోవడం మేలని అభిప్రాయం
- గతంలో వీరి భాగస్వామ్యంతో త్వరితగతిన పరిశీలన
- తమను వాడుకోవాలని కోరుతూ లైసెన్సుడు సర్వేయర్ల వినతి

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) విజయవంతంగా అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. గతంలోలాగానే ఈ సారి కూడా ఆటంకాలు ఎదురేయ్యేలా ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు సర్వేయర్ల కొరత తీవ్ర ప్రతిబంధకంగా మారనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ నగర పాలక సంస్థ సహా తొమ్మిది మున్సిపాలిటీల్లో ప్రభుత్వ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. సర్వేయర్లు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఎలా అమలు చేసేదని మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ అమలు వైఫల్యానికి ఇదే ప్రధాన కారణం. ఈ సారి కూడా అదే పరిస్థితి ఏర్పడనుంది. ఈ ప్రధాన సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌తో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్‌లకు అప్పగించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. చెరువులు, వాటి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, రవాణా, కొండలు, గుట్టలు, హెరిటేజ్ తదితర ప్రాంతాలను నిర్ధారించేది ఎవరన్నది ప్రశ్నార్థకంగామారింది. రిజిస్ట్రేషన్ విభాగంలో పని చేసే సిబ్బందికి మాస్టర్ ప్లాన్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూములు తదితర వాటి గురించి ఏ మేరకు అవగాహన ఉంటుందనేది ప్రశ్నగా మిగిలింది. పైగా ఎన్‌వోసీలు తెచ్చినవారికే ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని రిజిస్ట్రేషన్ అధికారులు అంటుండగా.. అసలు ఈ ఎన్‌వోసీలు ఎవరు ఇవ్వాలన్నది పెద్ద సమస్యగా మారింది. ఎల్‌ఆర్‌ఎస్ పలు ప్రభుత్వ శాఖలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఎన్‌వోసీలను రెవెన్యూశాఖ, మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖల నుంచి తెచ్చుకోవలసి ఉంటుంది. ఈ శాఖలు కూడా క్షేత్ర స్థాయిలో తనఖీలు చేసిన తర్వాతగానీ ఇవ్వలేవు. దీని వల్ల అన్ని ఎన్‌వోసీలు అందేసరికి తీవ్ర జాప్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు గతంలో సంబంధిత శాఖకు చెందిన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సమన్వయ లోపం వల్ల ఇవి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో తనఖీలు నిర్వహించలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడనుంది.

యజమానుల్లో అనాసక్తి..

ప్లాట్లదారులు ఈ సారి ఎల్‌ఆర్‌ఎస్ పట్ల అంత అసక్తిగా లేరు. ఇప్పటికిప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలనే అతృత అంతగా కనిపించడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుంటే ఫీజులో 25శాతం రాయితీ సైతం ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా స్పందన అంతంత మాత్రంగానే ఉండటం నిదర్శనంగా కనిపిస్తోంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సాధారణంగా తమ ప్లాట్ల క్రయవిక్రయాలు జరిగినప్పుడు, సేల్ డీడ్ అయినప్పుడు మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళతారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించినవారు ఇప్పటికిప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలని అనుకోవడం లేదు. ప్లాట్లదారుల్లో చాలా మంది వాటిని కొన్న తర్వాత పెట్టుబడి రూపంలో అలా వాటిని అనుమతి లేకున్నా కొని వదిలేశారు. మార్కెట్‌లో మంచి రేటు పలికినప్పుడు లేదా ఆ ప్లాట్‌లో ఇల్లు నిర్మించాలనుకున్నప్పుడు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలని చాలా మంది అనుకుంటున్నారు. దీనితో ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ప్రభుత్వం ఆశించినంత కదలిక కనిపించడం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయిలో తనఖీలకు మాస్టర్ ప్లాన్‌తో పాటు ఎల్‌ఆర్‌ఎస్ బఫర్ జోన్ తదితర అంశాల పట్ల. అవగాహన లేని వార్డు ఆఫీసర్లకు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, చేయిన్ మెన్లకు ఈ బాధ్యత అప్పగించారు. ఇప్పటికే వారు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో దాఖలైన 1.41 లక్షల దరఖాస్తులను ఎప్పటికి పరిష్కరించేదన్న ప్రశ్న తలెత్తుతోంది.

ధరలు పడిపోవడమూ కారణమే!

ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్లాట్ల ధరలు గణనీయంగా పడిపోవడం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2020లో ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీం ఆలస్యం కావడంతో ప్రస్తుతం ఉన్న ధరలకు, ప్లాట్ల యజమానులు కొనుగోలు చేసిన ధరల్లో భారీగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ధరఖాస్తు చేసుకున్నవారి నుంచి స్పందన కరువైంది. మునిసిపాలిటీల పరిధిలోని ధరఖాస్తుదారులు మాత్రమే రెగ్యులరైజ్ చేసుకునేందుకు కాస్త ముందుకు వస్తున్నారు.

కొత్తవిధానమేదీ?

ఎల్‌ఆర్‌ఎస్ అమలు విషయంలో ప్రస్తుత ప్రభుత్వం కొత్త విధానాన్ని అనుసరించడం లేదు. గత బీఆర్‌ఎస్ సర్కార్ అనుసరించిన పద్ధతులనే అనుసరించేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో పాత విధానంలోని లోపాలు ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు మళ్లీ అడ్డంకులుగా మారుతున్నాయి. అమలులో సరళీకరణగానీ, స్పష్టత గానీ లేదు. గతంలో ఎదురైన అడ్డంకులను తొలగించే ప్రయత్నమూ కనిపించడం లేదు. దీనితో గతంలో ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో చేదు అనుభవాలను ఎదుర్కొన్న దరఖాస్తుదారులు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినా అంత ఆసక్తి చూపడం లేదు.

ఏం చేయాలి?

ఎల్‌ఆర్‌ఎస్ అమలులో మున్సిపల్ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉన్నందు వల్ల లైసెన్సుడు సర్వేయర్ల సహకారం తీసుకోవడం మేలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఎల్‌ఆర్‌ఎస్‌లో పాలుపంచుకోవడానికి లైసెన్సుడు సర్వేయర్లు కూడా సుముఖంగానే ఉన్నారు. తమ సేవలను వాడుకోవలసిందిగా గతంలోనే సంబంధిత శాఖల మంత్రులు, అధికారులను కలిసి వినతి పత్రాలను అందించారు. గతంలో ఆయా ఏరియాలను సర్వేపై చేయడానికి గతంలో జీడబ్ల్యూఎంసీ లైసెన్సుడ్ సర్వేయర్లకు ఈ బాధ్యత అప్పగించారు. వీరు కుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం ల్యాండ్ యూజ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్లాన్లను, మ్యాప్‌లను తయారు చేసి ఇచ్చినందు వల్ల ఎల్‌ఆర్‌ఎస్ 2007, 2010, 2013లో విజయవంతంగా అమలయ్యాయి. కానీ తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లైసెన్సు సర్వేయర్లను పక్కనబెట్టింది. దీనితో సరైన ప్లాన్లు లేకపోవడం, క్షేత్ర స్థాయిలో పరిశీలనల్లో జాప్యం వల్ల అప్పటి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అమలు నత్తనడకన సాగుతూ వస్తోంది. ఇప్పటికైనా ఎల్‌ఆర్‌ఎస్ అమలులో తమ సేవలను వినియోగించుకోవాలని లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో ఇదే విషయమై వారు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రాలను సైతం అందజేశారు.



ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న లైసెన్సుడు సర్వేయర్లు

లైసెన్సుడ్ సర్వేయర్లను వాడుకోవాలి

- గాజుల రఘు, జిల్లా లైసెన్సుడ్ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు



రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా లైసెన్సుడ్ సర్వేయర్లు ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 200 మంది వరకు ఉన్నారు. వీరిని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయిలో పరిశీలించి రిపోర్టులు ఇవ్వడానికి లైసెన్సుడ్ సర్వేయర్లను వాడుకోవాలి. దీని వల్ల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన జరుగుతుంది. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. అంతేకాకుండా ఆదాయం సమకూరుతుంది. పైగా మున్సిపాలిటీల నుంచి లైసెన్సులు పొందిన సర్వేయర్లు కనుక బాధ్యతాయుతంగా, నిజాయితీగా పని చేస్తారు. ఏ చిన్న తప్పు చేసినా లైసెన్సులు రద్దు చేసినా లైసెన్సులు రద్దు చేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఎలాగో ఉంది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనుభవం ఉంది.

ఇవిగో సాక్ష్యాలు..



అలనాటి గుర్తులను చూపుతున్న ఆలయ గైడ్

రామప్ప శిల్పాలు చెక్కింది ఇక్కడే..

వెంకటాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రామప్ప ప్రధాన ఆలయానికి సమీపంలోని మట్టికోట నుంచి సరస్సు వరకు ఉన్న స్థలంలో రామప్ప శిల్పాలు చెక్కినట్లు ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయి. క్రీస్తు శకం 1213లో సరిగ్గా 812సంవత్సరాల క్రితం రామప్ప ఆలయ నిర్మాణం కోసం రామప్ప అనే ప్రధాన శిల్పి నేతృత్వంలో 300మంది శిల్పులు 40 సంవత్సరాలు కష్టపడి గుడి నిర్మించాలని పురావస్తుశాఖ ద్వారా తెలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి శిల్పాలను చెక్కి తీసుకువస్తే శిల్పాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆనాడే శిల్పులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఆ రోజుల్లోనే ప్రస్తుతం ప్రధాన గుడి తూర్పు ముఖద్వారం వైపు నుంచి 100మీటర్ల దూరంలో ఉన్న మట్టికోట నుంచి సరస్సును ఆనుకుని ఓ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రదేశంలో శిల్పాలు చెక్కేందుకు వీలుగా 300నుంచి 400వరకు బండలను (పల్లెటూర్లో తాత్కాలికంగా నిర్మించే పందిరి వలె) నిలబెట్టినట్టు తెలుస్తోంది. రామప్ప ఆలయ సమీపంలోని వనగుట్ట నుంచి సాండ్‌స్టోన్, ఇతర ప్రాంతాల నుంచి నల్లరాళ్లను ఈ ప్రదేశానికి తరలించి శిల్పాలు చెక్కినట్టు తెలుస్తోంది. వీటిలో ప్రధానంగా నాలుగు నల్లరాతి స్తంభాలు, శివలింగం, ప్రధాన ఆలయ ద్వారం, గర్భగుడిలాంటి వాటిని రమణీయంగా చెక్కారు. అదేవిధంగా శిల్పాలు చెక్కే సమయంలో భూమిలోకి దిగబడకుండా మూడుమీటర్ల లోతు గుంతను తీసి ఆ గుంతలో రాయిని వేసి వాటిపై శిల్పాలు చెక్కినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అలనాడు నిలబెట్టిన బండ కొయ్యలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. వందల సంవత్సరాల నాటిక్రితమే రమణీయంగా తీర్చిదిద్దిన రామప్ప చరిత్ర వెనుక ఈ స్థలానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.



ప్రస్తుతం కనిపిస్తున్న ఆనవాళ్లు ఇవే..

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కొత్తగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపా ధ్యక్షుడు సిద్దబోయిన జీవన్ డిమాండ చేశారు. కొత్తగూడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ల చేతికి అప్పగించే విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈనెల 21, 22, 23న మహరాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ మూడవ మహసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గొగ్గెల రాంబాబు, మండల నాయకులు జిట్టబోయిన రామచంద్రు పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో వరికి బోనస్ డబ్బులు చెల్లించాలని, రైతు రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బట్టు నాగేశ్వర్‌రావు, కొట్టం అంజయ్య, అన్నారపు హనుమంతు, బ్రహ్మచారి, వీరన్న పాల్గొన్నారు.

● గార్ల : ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో తునికాకు రోలింగ్ పనులు ప్రారంభించి గిరిజన ప్రజలకు ఉపాధి అవకా శాలు కల్పించాలని ఏఐకేఎం ఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు ఎఐకేఎంఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తాహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల కట్టకు రూ. 6 చెల్లించే విధంగా ధరలు నిర్ణయించాలన్నారు ఈకార్యక్రమంలో మాన్య నాయక్, మట్టపల్లి వీరభద్రం, సూత్రపు మనోహర్, ఇర్రి రవి, గణేష్ శంకర్,సీతారాం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడలో మాట్లాడుతున్న జీవన్


కేసముద్రంలో ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన


ఎదుట ఆందోళన చేస్తున్న బోడ్కాతండా ప్రజలు

నర్సింహులపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడ్కాతండాకు చెందిన ప్రజలు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి బైఠాయించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన భద్రు, రాంజీ, సుమన్ మాంగ్యా, వీరన్న దేవీసింగ్ మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా మండలంలోని గోల్‌తండా, బోడ్కాతండా, ధన్‌సింగ్‌తండా, దూప్యాతండా, చర్లచంద్రుతండా, పూసలతండాను కలుపుకొని గోల్ బోడ్కాతండ జీపీగా ఏర్పాటు చేశారన్నారు. బోడ్కాతండా పాఠశాల భవనంలోని ఒక గదిని జీపీ సేవలకు కేటాయించి ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు.. ఇటీవల ధన్‌సింగ్‌తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ భవనంలోకి రికార్డులు తరలించి కొత్త జీపీ భవనంగా వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. పంచాయతీ అధికారులు నిర్ణయాన్ని ఉపసంహరించుకొని బోడ్కాతండాలో జీపీకి పక్కా భవనం ఏర్పాటు చేసి ఇక్కడి నుంచే ప్రజలకు సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కిన్నెర యాకయ్యకు వినతి పత్రం అందజేశారు.

మునిసిపాలిటీ కార్మికుల నిరసన

కేసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో అమినాపురంలో పారిశుధ్య కార్మికురాలు కొమ్ము యాదమ్మపై చెప్పుతో దాడి చేసి గాయపర్చిన మహిళపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో పురపాలక సంఘం కార్యాలయం ఎదుట సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై దాడి చేయడం హేయనీయమని, వెంటనే నిందితురాలిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాగంటి కిషన్, బీర్రు కనకలక్ష్మి, సింగారపు యాకమ్మ, కృష్ణ, టేకుల శ్రీనివాస్, కుమారస్వామి, రాజు, శంకర్, ప్రశాంత్, శ్రవణ్, యాకయ్య, భాస్కర్, సంజీవ పాల్గొన్నారు.

క్వారీల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి

కేసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని వివిధ రకాల క్వారీల వద్ద కార్మికుల భద్రత కోసం అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సంబంధిత సెల్ నెంబర్లు సూచించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో భూగర్భ గనుల శాఖ ఏడీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీల్లో కార్మికుల రక్షణకు, బ్లాస్టింగ్ నిబంధనలను పాటించడంలేదని ఆరోపించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాటోత్ బిచ్యానాయక్ ఉన్నారు.

మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి

గార్ల మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :అప్పుల ఊబిలో కురుక పోయిన మిర్చి రైతులను ఆదుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ. 25వేలు ధరను నియమించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరి నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముత్తితండా కోట్యానాయక్ తండాల్లో మిర్చి కల్లాలను సందర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రాష్ట్రంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరలను ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. భూక్యా శ్రీను, ధరవత్ వెంకన్న, ఇస్లావత్ మంగిలాల్, వెంకన్న రవి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ప్రత్యేకాధికారి తనిఖీలు

కురవి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కురవి ఆశ్రమ గురుకుల పాఠశాలను, నేరడ కస్తూర్బా పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ నర్సింహామూర్తి సోమవారం తనిఖీచేశారు. వంట గది, తరగతి గదులను తనిఖీలు చేసి పరిశుభ్రత పాటించాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు మంచిగా రాసి నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

గంగమ్మ గుడి నిర్మాణానికి స్థలం వితరణ

డోర్నకల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ శివారులో గంగమ్మ ఆలయ నిర్మాణానికి స్థానిక యాదవనగర్‌కు చెందిన దివంగత సకినాల కుంటయ్య పేరిట అతని కుటుంబసభ్యులు 120 గజాల స్థలాన్ని యాదవ సంఘం సభ్యులకు సోమవారం అందించారు. ఈ మేరకు అంగీకారపత్రాన్ని యాదవసంఘం నాయకులు శీలం శ్రీనివాస్‌కు అందించారు. గంగమ్మ గుడి నిర్మాణానికి స్థలం అందించిన సకినాల కుంటయ్య కుటుంబసభ్యులైన సకినాల వెంకన్న, సకినాల సీతారాములతో పాటు కుటుంబసభ్యులకు యాదవులు కృతజ్ఞతలు తెలిపారు

టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బోడ రమేష్‌ను సోమవారం గూడూరు మండలం భూపతిపేట పాఠశాలలో ఉపాధ్యాయ బృందం శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బోడ రమేష్ తెలిపారు. హెచ్ఎం గోపి, కృష్ణమూర్తి, నీరజ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఇనుగుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో కటాస్ విభాగంలో ఇనుగుర్తి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వనపర్తి శ్రీలక్ష్మి, గొల్లపల్లి అంజనీదేవి, కుంచాల ఐశ్వర్య ప్రతిభకనబర్చి గోల్డ్‌మెడల్ సాధించినట్లు హెచ్ఎం రూపారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థులతోపాటు కుంగ్‌ఫూ కోచ్ గడ్డల రాజు, పీడీ ప్రణయ్‌లను అభినందించారు.

మరిపెడ ప్రెస్ క్లబ్ ఎన్నిక

మరిపెడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ ప్రెస్ క్లబ్ ఎన్నికను ఆ క్లబ్ సభ్యులు స్థానిక జర్నలిస్ట్ కాలనీలో సమావేశమై సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోడా నాగేందర్, అధ్యక్షుడిగా మూడ్ శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శిగా మొగలగాని మహేందర్, ఉపాధ్యక్షులుగా తప్పెట్ల సురేశ్, భానోత్ ప్రవీణ్‌నాయక్, గండి నాగరాజు, కోశాధి కారిగా డాక్టర్ రాజు, సహాయ కార్యదర్శులుగా భాషిపంగు వెంకన్న (పోస్టు), చిలువేరు ఉపేందర్, సమాచార కార్యదర్శిగా చింత వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోడా శ్రీనివాస్‌నాయక్ ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్స్‌గా పులుసు సతీశ్, ఎస్‌కే.యాకుబ్, అల్వాల ఉమేశ్, అఫ్జల్‌ఖాన్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల పర్యవేక్షలుగా గాడిపెల్లి శ్రీశైలం, గంధసిరి రవి వ్యవహరించారు.

పంటలకు సాగునీరందించాలి

నెల్లికుదురు మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చెరువులలో నీరులేక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని సాగు నీరు అందించాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ మదన్‌లాల్ సోమవారం హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఎన్‌సీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ డీబీఎం 48, 10 ఎన్ఆర్ కాలువలో చెట్లు మొలిచి నీరు సక్రమంగా అందడకపోవడంతో చెరువలులోకి చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదన్నారు. రైతులు ఇబ్బందులు పడుతన్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. నెల్లికుదురు మండలానికి నీటిపారుదల శాఖలో నలుగురు ఏఈలు ఉండాల్సిందిగా ఒకరు మాత్రమే విధులు నిర్విహిచండంతో పనులు సక్రమంగా జరగడంలేదన్నారు. ఎస్సారెస్పీ కాలువలు మర మ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని కోరారు. బీజేపీ నాయ కులు సింగారపు సతీష్, చీకటి మహేష్, సందీప్, సాయి పాల్గొన్నారు.

● చిన్నగూడూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల చెరువులను ఎస్సారెస్పీ జలాల ద్వారా నింపి రైతులకు సాగు నీరు అందించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ ఎస్సీ నరసింహారావుకు ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంగోతు చందూలాల్, సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందూలాల్ మాట్లాడుతూ అతి వర్షాలతో చెరువులు, వాగులకు గండ్లు పడి భూగర్భ జలాలు అడుగంటి చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయి రైతుల ఆవేదన చెందుతుంటే ప్రభుత్వానికి పట్టింపులేదని విమర్శించారు. చివరి అయకట్టు వరకు నీరు అందిస్తామన్న ప్రభుత్వం మాట మార్చిందని ఎద్దేవా చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ జలాలు విడుదల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఓ జిల్లా కన్వీనర్ బోడ చందూలాల్ పాల్గొన్నారు.

నిధులు కేటాయింపు హర్షణీయం


మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వెన్నమల్ల అజయ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రధాని మోదీ రూ.500 కోట్లు నిధులు కేటాయి ంచడం హర్షనీయమని బీజేపీ మానుకోట పట్టణాధ్యక్షులు వెన్నమల్ల అజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్‌లో సోమవారం ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, బోయి నపల్లి లక్ష్మణ్‌రావు, మోసంగి మురళి, ఆకుల శ్రీనివాస్, గడ్డం అశోక్, ఇందు భారతి, ఓర్సు పద్మావతి, సంపత్‌రావు, రాజుగౌడ్, జయే ందర్‌నాయక్, చుక్కల నరేష్, భద్రయ్య, బాలునాయక్, వెన్నమల్ల సందీప్, మల్లం యశ్వంత్, శ్రీను పాల్గొన్నారు.

● కేసముద్రం : వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ అన్నారు. కేసముద్రంలో సోమవారం ప్రధాని మోదీ, పౌర విమానయాన మంత్రి కె.రాంమోహన్‌నాయుడు చిత్రపటాలకు పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదిల నర్సింహారెడ్డి, వోలం శ్రీనివాస్, గాంతి వెంకటరెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్, వేముల సతీష్‌రెడ్డి, బచ్చు లక్ష్మినారాయణ, మల్యాల రాములు, ఖాసీం పాల్గొన్నారు.

కులగణన సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :కులగణన సర్వే చేసిన ఎన్యుమరేటర్స్ సూపర్‌వైజర్లకు రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నవంబరు 6 నుంచి 20వ తేదీ వరకు కులగణన సర్వే నిర్వహించి, సర్వే వివరాల డేటాను కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. ప్రొసీడింగ్ ఆర్‌సీ నెంబర్. 6280 దారా బడ్జెట్‌ను డిసెంబరు 5, 2024 ద్వారా వివిధ జిల్లాలకు నిధులు మంజూరైనవని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాచకొండ ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి, లింగారెడ్డి, శివకుమార్, శ్రీనివాస్, కార్తీక్ తదితరులుపాల్గొన్నారు.

మెదక్ ఎంపీని కలిసిన వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర నాయకులు, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మహబూబాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షులు వల్లభ వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల నూతనంగా జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రఘునందన్‌రావును కలిసినట్లు పేర్కొన్నారు. పార్టీ పరంగా జిల్లా అభివృద్ధి కోసం తనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటిమహేష్‌గౌడ్, సింగారపు సతీష్, గుగులోతు మదన్, పల్లె సందీప్, అల్లం సాయి, ప్రవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలుపాలి

పెద్దవంగర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలని మాజీ సర్పంచ్ పాకనాటి రామకృష్ణరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి వెంకన్న గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్‌బీ తండాలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు జాటోతు ఖండ్య, కాంగ్రెస్ నాయకులు రాములు, సుమన్, పరమేష్, రాజు, బిచ్చ, వంకర్, వెంకట్రామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

తొర్రూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఇతర నల్లా పన్నులను సకాలంలో చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీ ఆవరణలో ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి రశీదు అందించి ఆయన మాట్లాడారు. ఈ నెల 31 వరకు 25శాతం రిబేట్‌తో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఫీజులు చెల్లించుకోవచ్చన్నారు. మార్చి 31లోగా ఇంటి పన్నులు, ఇతర పన్నులను చెల్లించి అధిక వడ్డీల నుంచి విముక్తి పొందాలన్నారు. దుకాణదారులు కూడా లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్ల స్వామి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కాసం షాపింగ్ మాల్, నీలం ఎలక్ట్రికల్స్ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా వస్త్ర దుకాణంలో కంపెనీ పేరులేని బాక్స్ ఐటమ్‌లు దొరకడంతో రెండు కేసులు నమోదు చేయగా, నీలం ఎలక్ట్రికల్స్‌లో కూడ కంపెనీ పేరులేని కరెంట్ వైరు బెండల్స్ దొరకడంతో రెండు కేసులు నమోదు చేసినట్లు తూనికలు, కొలతల శాఖ అధికారి విజయ్‌కుమార్, వినియోగదారుల సమాచారం కేంద్రం అధ్యక్షులు ఇంజమూరి సుధాకర్‌తో పాటు జిల్లా కస్టమ్స్ ఫోరం సభ్యులు జానీ తెలిపారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న ఉద్యమకారులు

మహబూబాబాద్ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్వరాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారులు దార్ల శివరాజ్, అహ్మద్ ఖాన్, ఇనుగుర్తి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి సంవత్సరం దాటినప్పటికి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం పంపిణీ హామిగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మానుకోటలో తామంతా రాస్తారోకోలు, రైలురోకోలు, పాదయాత్రలు చేసి లాఠీ దెబ్బలు తిని జైలుకు సైతం వెళ్లి తీవ్రంగా నష్ట పోయామని వాపోయారు. ఈ కార్యక్రమం లో నలమాస సాయి, రామకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

తొర్రూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వేంకటేశ్వర స్వామి భూనీలా పద్మావతి కల్యాణ వేడుకలను ఆలయ అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. స్థానాచార్యులు ఓలేటి యాదగిరాచార్యులు మాట్లాడుతూ కలియుగ సంక్షేమం కోసం పట్టణ అభివృద్ధికి స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ గీతా రాజేందర్ రెడ్డి, నాగమల్ల కృష్ణమూర్తి, ప్రభాకర్, శారద, లక్ష్మి ప్రసన్న, గీతారాణి, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అధ్యయనం చేసి విద్యనందించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థులుగా అధ్యయనం చేసి పాఠశాలల్లో విద్యార్థులకు విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్, ఏకశిలా ఏంజిల్స్ హై స్కూల్స్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన డీఎస్సీ- 2024లో నియామకమైన ఉపాధ్యాయులకు శిక్షణ సోమవారంతో ము గిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయా ల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను క్రమ శిక్షణగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. మౌళిక సామ ర్థ్యాల పెంపు, మాతృ భాష, ఆంగ్లభాష, గణిత అంశాలు, సూక్ష్మబోధన అంశాలలో నైపుణ్యాలు పెంపొందించుకొని విద్యార్థులకు బోధనచేయాలని సూచించారు. ఈ శిక్షణలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఆర్పీలు ప్రవీణ్‌కుమార్, నాగముని, రమేష్, వీరన్న, ఓంకార్, యాదగిరి, ప్రవీణ్, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, సారంగం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వివాహిత మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు భవానిశంకర్‌తండాలో ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టౌన్ ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం, దరిబాది తాలూకా, కందమల్ జిల్లా, స్రంబాది గ్రామానికి చెందిన చంద్రమ మాలిక్(27) ఇదే రాష్ట్రానికి చెందిన జాజపూర్ జిల్లా, మంగళపూర్‌కు చెందిన అనిల్‌కుమార్‌ను 2024 డిసెంబర్ 23న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆపై జిల్లా కేంద్రానికి వచ్చి భవానిశంకర్‌తండాలో ఓ ఇంటిని కిరాయికి తీసుకుని నివాసముంటున్నారు. అనిల్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చంద్రమ మాలిక్ ఏం పనిచేయకుండా ఇంటి వద్దనే ఉండడంతో ఇద్దరం చేరొక పని చేస్తేనే ఇళ్ల గడుస్తుందని భర్త అనిల్ కుమార్ భార్యను మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నెల 1న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్షణికావేశంలో చంద్రమ మాలిక్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త అనిల్‌కుమార్ కూలీ పనులకు పోయి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య ఉరివేసుకుని కన్పించడంతో వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి తండ్రి మాలిక్ మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోన్ కాల్‌తో రూ.45 వేలు మాయం

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఓ అపరిచిత వ్యక్తి వద్ద నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో తన అకౌంట్‌లో నుంచి రూ.45 వేలు మాయమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం పత్తిపాకలో సోమవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక కాలనీకి చెందిన కొటూరు శ్రీనివాస్‌కు 9 మార్చి 2024న ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చి మీకు ల్యాండ్ ఉంటే ఆ స్థలంలో తాము సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందుకు గాను మీకు నెలకు రూ.40 వేలు అద్దె రూపంలో ఇస్తామని నమ్మబలికారు. ఆ తర్వాత మరోసారి ఫోన్ చేసి డాక్యుమెంట్‌ల ఖర్చుల కోసం రూ.5 వేలు మీరు ముందుగా చెల్లించాలని నమ్మించారు. ఇంకోసారి 11 మార్చి 2024న ఐటీ చెల్లించాల్సి ఉంటుందని రూ.40 వేలు ఫోన్‌పే చేస్తే మళ్లీ మీకు రూ.45 లక్షల చెక్కును అందిస్తామని నమ్మించారు. ఇది నమ్మిన కొటూరు శ్రీనివాస్ ఫోన్ పే ద్వార వారి అకౌంట్‌కు రూ.45 వేలు పంపించాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు ఫోన్ చేస్తే వారి నెంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు శ్రీనివాస్ సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :సోషల్ మీడియా గ్రూప్‌లో అనుచిత వాఖ్యలు పోస్ట్ చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కర్ర జనార్దన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి అనిల్ గ్రామ సోషల్ మీడియా గ్రూప్‌లో అనుచిత వాఖ్యలు పోస్ట్ చేశారు. బాధితుడు కర్ర జనార్దన్‌రెడ్డి ఫిర్యాదుతో పెద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కురవి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గత 25న హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కర్న సంప్రీత్ సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంప్రీత్ ఇటీవలనే బీటెక్ పూర్తి చేశాడు. స్నేహితుడి బర్త్‌డే పార్టీఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సంప్రీత్ అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని సమాచారం రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్న సంప్రీత్ మృతి చెందాడు. సంప్రీత్ మృతితో తండ్రి కర్రం రాజు దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. సోమవారం రాత్రి సంప్రీత్ మృతదేహాన్ని కురవికి తీసుకువచ్చారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపంతో కలుపు నివారణ మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఉయ్యాలవాడలో సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యాలవాడకు చెందిన పోటు సాయి (30) ఈ నెల 1న ఆర్థిక ఇబ్బందులకు తోడు రుణంపై తీసుకున్న ట్రాక్టర్ వాయిదాలు చెల్లించకలేక మనస్తాపంతో కలుపు నివారణ మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సా యిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య సాయిసింధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై దాడి, ముగ్గురిపై కేసు నమోదు

కొత్తగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన పాయం యశోద ఇంటి పక్కన ఇంట్లో భారీ శబ్దంతో పాటులు వస్తుండగా శబ్ధం తక్కువ పెట్టమని చెప్పింది. దీంతో తాటి కృష్ణ, తాటి సన్నీ, పాయం కాంతమ్మలు యశోదపై దాడి చేశారు. పాయం యశోద ఫిర్యాదుతో తాటి కృష్ణ, తాటి సన్నీ, పాయం కాంతమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

దాట్ల శివారు ఆలయాల్లో చోరీ

దంతాలపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాట్ల పెద్ద చెరువు కట్టపై ఉన్న పెద్దమ్మతల్లి, గంగమ్మతల్లి ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేసి హుండీలను ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి రూ.10వేలు, గంగమ్మతల్లి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. సుమారు ఈ హుండిలో రూ.10వేలు ఉంటుందని. దాట్లకు చెందిన పంజా భిక్షం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో క్లూస్ టీం తనిఖీలు చేసి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని బేడబుడగ జంగాల కాలనీలో ఫిబ్రవరి 22 రాత్రి దొంగలు పడ్డ విషయం తెలిసిందే. వారంలో రెండో దొంగతనం కావడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే తమకు ఫోన్లో సమాచారం ఇవ్వాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు.